రైలు కింద పడి వివాహిత, యువకుడి ఆత్మహత్య

● వివాహేతర సంబంధమే కారణం

మిర్యాలగూడ, మే 30 : మిర్యాలగూడ మండం వెంకటాద్రిపాలెం పరిధిలోని దుర్గా నగర్‌కు చెందిన ఆర్.ధనలక్ష్మి (22), జి.దుర్గా ప్రసాద్(19) గురువారం ఉదయం మిర్యాల గూడ, కుక్కడం గ్రామాల మధ్య ఐలాపురం రైల్వే ట్రాక్‌పై గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాద్రి పాలెం గ్రామానికి చెందిన ధనలక్ష్మి వివాహం ఐదేండ్ల క్రితం దుర్గానగర్‌కు చెందిన రవికాంత్‌తో జరిగింది. వీరికి నాలుగు సంవత్సరాల బాబు, మూడు సంవత్సరాల పాప ఉన్నారు. దుర్గానగర్‌కు చెందిన జి.దుర్గాప్రసాద్‌తో ధన లక్ష్మికి పరిచయం ఏర్పడగా అదికాస్త వివాహేతర సంబంధంగా మారింది. విషయం ఇంట్లో తెలియడంతో ధనలక్ష్మి, ఆమె భర్త రవికాంత్‌ల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. దాంతో మూడు రోజుల క్రితం ధనలక్ష్మి భర్తను వదిలి వెంకటాద్రిపాలెంలోని పుట్టింటికి వెళ్లింది. బుధవారం ధనలక్ష్మి, దుర్గాప్రసాద్‌తో కలిసి ఊరి నుంచి వెళ్లిపోయింది. దాంతో ధన లక్ష్మి కనిపించడం లేదని ఆమె భర్త రవికాంత్ మిర్యాలగూడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో గురువారం ఉదయం ధన లక్ష్మి, దుర్గాప్రసాద్ గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు

రోగులను ప్రభుత్వ ఆస్పత్రులకు పంపుతున్నామనే దాడులు

● సుశృత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు హనుమంతరావు

నీలగిరి, మే 30 : గ్రామీణ ప్రాంతాల రోగులకు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు పంపిస్తున్నామనే కుట్రతోనే రాష్ట్ర మెడికల్ కౌన్సిల్, ఐఎంఏ, హెచ్ఆర్‌డీఏ సభ్యులు పీఎంపీ, ఆర్ఎంపీల క్లినిక్‌లపై దాడులకు పాల్పడుతున్నారని సుశృత గ్రామీణ వైద్యులు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.హనుమంతరావు ఆరోపించారు. గురువారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ వైద్యుల క్లినిక్‌లపై యాంటీ క్వాకరీ సభ్యుల పేరుతో దాడులు చేసి తమను ప్రజల్లో దోషులుగా నిలబెట్టాలని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. పీఎంపీ, ఆర్ఎంపీలపై దాడులు చేయాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదన్నారు. కేవలం వారి ఆస్పత్రులకు రోగులను ఆకర్షించే చర్యల్లో భాగంగానే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. తాము ఎక్కడా అబార్షన్లు, కాన్పులు, శస్త్ర చికిత్సలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ప్రథమ చికిత్స చేసి ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఇచ్చిన అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయడంలో తాము ప్రధాన భూమిక పోషిస్తున్నామని అన్నారు. వెంటనే ఇలాంటి చర్యలను మానుకోకపోతే భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బి. శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి జి.నర్సింహారెడ్డి, కోశాధికారి సీహెచ్ బ్రహ్మచారి, డీఎస్ఎన్ చారి, అమనగంటి కృష్ణారెడ్డి, పి.వెంకటేశ్వర్‌గౌడ్, ఎం. మదనాచారి, అమరోజు యాదగిరి పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులతో వన్‌టౌన్ ఎస్ఐ శంకర్

కూచిపూడి శిక్షణ శిబిరం ముగింపు

రామగిరి, మే 30: సిద్ధేంద్రయోగి కూచిపూడి నృత్య కళా కేంద్రం నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి కూచిపూడి శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. రామగిరిలోని అక్షర పాఠశాలలో నిర్వహించిన ముగింపు ఉత్సవంలో వన్‌టౌన్ ఎస్ఐ శంకర్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేలా విద్యార్థులకు నృత్య కళలపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళా కేంద్రం శిక్షకుడు పాలబిందేల బాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సైదులు

కేక్ కట్ చేస్తున్న సీఐటీయూ నాయకులు

హాలియా, మే 30 : కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతాసైదులు అన్నారు. గురువారం హాలియాలో సంఘం 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సెంటర్లలో సంఘం జెండాను ఆవిష్కరించారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు పంచిపెడుతూ నిత్యావసరాల భారం పెంచుతూ పేదలపై భారం మోపుతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో భవన కార్మిక సంఘం నాయకులు సయ్యద్ హుస్సేన్, జానిమియా, అన్నెపాక శ్రీను, తోటపల్లి వెంకటయ్య, అనుముల అంజి, లింగయ్య, శంకర్, ఆంజనేయులు కార్మికులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
KOPPURAPU RAMAKRISHNA REDDY ALIAS KOPPURAPU RAMAKRISHNA, S/o. Ram Reddy, H.No. 12-6-113, Alkapuri Colony, Nalgonda Town and (Dist.). I hereby declare and confirm that My Name "KOPPURAPU RAMAKRISHNA REDDY" and "KOPPURAPU RAMAKRISHNA" both Names belongs to one and the same person only therefore me.

CHANGE OF NAME
I MUSKE LAXMI W/O. ANUGU RAMACHANDRA REDDY (OLD NAME) R/O.H.NO.2-81, KANCHANAPALLY VILLAGE, NALGONDA MANDAL, NALGONDA DISTRICT. TELANGANA STATE. I HAVE CHANGED MY NAME AS LAKSHMI ANUGU W/O. ANUGU RAMACHANDRA REDDY (NEW NAME)

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777196 | చౌటుప్పల్: 9182777638

గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసిన కానుగు చెట్లు

నీడలేక పోవడంతో ఎండలోనే బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

హరితహారం చెట్ల నరికివేత.. నీడ లేక ప్రయాణికుల వెత

● చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి

కట్టంగూర్, మే 3 : మండల కేంద్రంలోని సంత ప్రాంతంలో నల్లగొండ బస్‌స్టాప్ వద్ద జాతీయ రహదారి వెంట మొదటి విడుత హరితహారం కార్యక్రమంలో భాగంగా కానుగ మొక్కలను నాటారు. ప్రస్తుతం అవి పెరిగి పెద్దవై నీడనిస్తున్నాయి. నల్లగొండ, హైదరాబాద్, నార్కట్‌పల్లి వైపు వెళ్లే ప్రయాణికులు ఈ చెట్ల నీడకు నిలబడి బస్సుల కోసం ఎదురు చూసే వారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పది కానుకు చెట్లను నరికి వేశారు. దాంతో ప్రయాణికులు నిలువ నీడలేక అవస్థలు పడుతున్నారు. ఎర్రటి ఎండలోనే నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమం చేపట్టి మొక్కలు పెంచగా ఇలా ఇష్టారాజ్యంగా నరికి వేయడంపై స్థానిక ప్రజలు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్లను నరికిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓను వివరణ కోరగా హరితహారం చెట్లను నరికిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్‌గౌడ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు జిల్లా కేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ సిటి, మే 30 : జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి 11 గంటల వరకు నల్లగొండలోని చైతన్యపురికాలనీ, దుప్పలపల్లిరోడ్డు, గంధవారిగూడెంరోడ్డు, సూర్యవంశీకాలనీ, దేవరకొండరోడ్డు, కనకదుర్గకాలనీ, ఎన్‌జీకాలనీ, శ్రీనగర్‌కాలనీ, క్లాక్‌టవర్, హౌసింగ్‌బోర్డు, ఆర్‌పీరోడ్డు, తులసీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన

మునుగోడు, మే30 : విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పులిపలుపుల వ్యవసాయ క్లస్టర్ ఏఈఓ నర్సింహగౌడ్ గురువారం గంగోరిగూడెం రైతులకు అవగాహన కల్పించారు. కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్, బిల్లును పంటకాలం పూర్తియ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని అన్నారు.

కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదు తీసుకోవాలి : ఏఓ

మిర్యాలగూడ, మే 30: రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో దుకాణదారుడి నుంచి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని ఏఓ సరిత సూచించారు. గురువారం మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగామన కల్పించారు. రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ నుంచి ప్యాకింగ్ చేయబడిన, లేబుల్ ఉన్న విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. నందిపాడులోనీ టీఎస్ సీడ్స్‌లో, పీఏసీఎస్‌లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, జీలుగ 30 కిలోలు రూ.1116, జనుము 40 కిలోలు రూ.1448కు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కావాలిసన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ తీసుకెళ్లి తెచ్చుకోవాలని సూచించారు.

స్వీపర్ కుటుంబానికి ఆర్థిక సాయం

మాల్,మే 30 : చింతపల్లి మండలం హోమంతల పల్లి గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పని చేస్తున్న ముదిగొండ జంగమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. పంచాయతీ కార్యదర్శి కవిత ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

ఆర్థిక సాయం

త్రిపురారం, మే 30: మండల కేంద్రానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికురాలు ఈట పార్వతమ్మ(60) గురువారం గుండెపోటుతో మృతి చెందింది. మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి కార్మికురాలి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట పడిశెల సుమలత, శ్రీను, వెంకన్న ఉన్నారు.

రేపు హనుమాన్ జయంతి

చిట్యాల, మే 30 : వెల్మినేడులోని ఆంజనేయస్వామి దేవాలయంలో జూన్ 1న హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా హోమాలు, పుష్పార్చన, అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు.

డ్రగ్స్‌ను పూర్తిస్థాయిలో అరికట్టాలి : డీవైఎఫ్ఐ

నల్లగొండ సిటీ(కనగల్), మే 30 : గంజాయి, డ్రగ్స్ బారిన పడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మత్తు పదార్థాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేశ్ కోరారు. గురువారం కనగల్ మండలంలోని వేముల నాగయ్య భవనంలో జరిగిన సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని కొంత మంది అడ్డదారిలో గంజాయి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు అక్రమ్, శివ, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా

దేవరకొండరూరల్, మే 30 : మండల సర్వసభ్య సమావేశం కోరంలేక వాయిదా పడింది. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేశారు. అయితే సమావేశానికి ప్రజాప్రతినిధుల హాజరు కాక పోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ జాన్‌యాదవ్ ప్రకటించారు. మళ్లీ సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

నేడు ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో వాహనాల వేలం

దేవరకొండరూరల్, మే 30 : దేవరకొండ ఎక్సైజ్ శాఖ అధికారులు వివిధ కేసుల్లో పట్టుకున్న వాహనాలను శుక్రవారం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొన దలచుకున్న వారు బైక్‌లకు రూ.10వేలు, ఫోర్ వీలర్లకు రూ.30వేలు డిపాజిట్ చేసి ఉదయం 8 గంటల వరకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

● ఏడీఏ రామారావునాయక్

పీఏసీఎస్‌లో విత్తనాల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ

నకిరేకల్, మే 30 : వానకాలం సీజన్‌కు సంబంధించి పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై అందిస్తున్నట్లు ఏడీఏ డి. రామారావు నాయక్ తెలిపారు. గురువారం తాటికల్ పీఏసీఎస్ గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జీలుగ 61.8 క్వింటాళ్లు, జనుము 11.50 క్వింటాళ్లు, పత్తి 25.25 ప్యాకెట్లు, వరి విత్తనాలు 451 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి ఎండీ జానిమియా, ఏఈఓలు లింగయ్య, నాగరాజు, హిదాయతుల్లా, బీటీఎం విక్రమ్, సందీప్ ఉన్నారు.

విత్తనాల దుకాణాలు తనిఖీ

కేతేపల్లి : మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను గురువారం ఏడీఏ రామారావు నాయక్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో గల రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక రైతు వేదికల్లో విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించి విత్తనాల విక్రయాలపై నిబంధనలు పాటించాలని సూచించారు. ఈపీఓస్ ద్వారానే అమ్మకాలు నిర్వహించాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి బి. పురుశోత్తం, ఏఈఓలు బాలరాజు, వీరేశ్, ఉమేశ్ పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

● దేవరకొండ ఏడీఏ లక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మి

కొండమల్లేపల్లి మే 30 : విత్తన డీలర్లు అన్ని రకాల విత్తనాలను ఎమ్మార్పీకే రైతులకు అందించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దేవరకొండ ఏడీఏ ఆర్.లక్ష్మి హెచ్చరించారు. గురువారం మండంలోని కోల్‌ముంతల్ పహాడ్ రైతువేదికలో కొండమల్లేపల్లి, పెద్ద అడిశర్లపల్లి మండలాల ఫర్టిలైజర్ షాపు యజమానులతో నిర్వహించిన సమావేశంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. రైతులకు నాణ్యమైన బ్రాండెడ్ విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలన్నారు. కాలం చెల్లిన స్టాక్‌ను షాపుల్లో ఉంచవద్దని సూచించారు. డీలర్లు డీఫామ్, సోర్స్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, విడి విత్తనాలు రైతులు విక్రయించవద్దన్నారు. స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసిన రైతుకు రసీదు ఇవ్వాలని సూచించారు. రైతులు బ్రోకర్లను ఆశ్రయించకుండా ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే పత్తి విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. సమావేశంలో వ్యవసాయ అధికారులు వెంకన్న, రావుల పాండు, ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఆంజనేయులు, తేరటుపల్లి విఠల్, వెంకటేశ్వర్లు, నీలా విజయ్, టి. రమేశ్, శ్రీనివాసులు, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎర్రబెల్లి గ్రామపంచాయతీకి ఫ్రీజర్ బాక్స్ అందజేత

ఫ్రీజర్ బాక్స్ అందిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

నిడమనూరు, మే 30 : మండలంలోని ఎర్రబెల్లి గ్రామ పంచాయతీకి లయన్స్ క్లబ్ గెలాక్సీ నల్లగొండ ఆధ్వర్యంలో ఫ్రీజర్ బాక్స్‌ను అందించారు. గురువారం క్లబ్ అధ్యక్షుడు సిరిగిరి శ్రీనివాస్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శికి ఫ్రీజర్ బాక్స్‌ను అందించారు. కార్యక్రమంలో మల్టిపుల్ చైర్మన్ ఊరుకొండ ప్రభాకర్ రెడ్డి, జిల్లా దశరథ, శ్రీనివాస్, జాలిపర్తి నాగేశ్వర్‌రావు, ఏచూరి మురహరి, పుట్ట మధుసూదన్ రెడ్డి, కోటిరెడ్డి, జూలకంటి మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కట్టంగూర్, మ 30 : మండలంలోని పామనుగుండ్ల గ్రామంలో జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి రోడ్డు వెంట వెళ్తుండగా విజయవాడవైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొన్నట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు. మృతుడు బ్లూ జీన్స్ ప్యాంట్, తెల్లని గీతల షర్ట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నకిరేకల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పంచాయతీ కార్యదర్శి జయసుధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జూన్ 2న తెలంగాణ ఉద్యమకారులను సన్మానించాలి

● బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథనాయక్

మిర్యాలగూడ, మే 30 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ అమరుల కుటుంబాలను, ఉద్యమ కారులను సన్మానించాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథనాయక్ అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడడానికి అమరుల త్యాగం, ఉద్యమకారుల పోరాట స్ఫూర్తి ఎంతో కీలకమైందన్నారు. అలాంటి ఉద్యమకారులను, అమరుల కుటుంబాలను గుర్తించాలని కోరారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

నాంపల్లి, మే 30 : మండల పరిధిలోని దామెర గ్రామంలోని కోళ్లఫామ్‌లో పని చేస్తున్న కొలుగూరి రజిత (32) బుధవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జయశంకర్ జిల్లాకు చెందిన కొలగూరి రజిత, గోరపాటి ధర్మరాజు కోళ్లఫాంలో పని చేస్తున్నారు. బుధవారం రాత్రి పని విషయంలో ఇద్దరికీ గొడవ జరిగింది. గురువారం ఉదయం పని కొసం పిలువడానికి వెళ్లగా ఆమె నివాసముంటున్న గదిలో చున్నీతో ఉరేసుకొని మృతి చెంది ఉంది. అందులో పని చేస్తున్న సూపర్ వైజర్ గణేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపాడు.

నీటితో కళకళలాడుతున్న శాలిగౌరారం ప్రాజెక్ట్

శాలిగౌరారం ప్రాజెక్టుకు జళ కళ

శాలిగౌరారం, మే 30 : శాలిగౌరారం ప్రాజెక్ట్ మండు వేసవిలోనూ నీటితో కళకళలాడుతున్నది. మూసీ ఎగువ ప్రాంతాల్లో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 21అడుగులు కాగా గురువారం నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 16.6 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతుండడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సరైన వర్షాలు కురువక పోవడంతో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండలేదు. దాంతో యాసంగి సీజన్‌లో ఆయకట్టు కింద పూర్తి స్థాయిలో వరి సాగు కాలేదు. ప్రస్తుతం ప్రాజెక్టులో సరిపడా నీటిమట్టం చేరడంతో
వానకాలం సీజన్‌లో జూన్ మొదటి వారంలోనే ఆయకట్టుకు సాగు నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే వీరేశం

సందీప్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే

నకిరేకల్, మే 30 : ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హామీ ఇచ్చారు. నకిరేకల్ మండలం మోదినిగూడెం గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి, బొడ్రాయి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేవీ ఉద్యోగి మృతికి సంతాపం

నకిరేకల్ : మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన నేవీ ఉద్యోగి మారెడ్డి సందీప్‌రెడ్డి గురువారం మృతి చెందాడు. ఎమ్మెల్యే వేముల వీరేశం గ్రామానికి వెళ్లి సందీప్‌రెడ్డి భౌతిక కాయానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న ఉన్నారు.

అధికారికి వినతిపత్రం ఇస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

నిడమనూరు, మే 30 : పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు చాలీ చాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి ప్రతినెలా సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడంతో జీవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు పెండింగ్ వేతనాలు అందించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందించిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి కందుకూరి కోటేశ్, సీఐటీయూ మండల
కన్వీనర్ కొమాండ్ల గుర్వయ్య, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఐదుగురికి గాయాలు

హాలియా, మే 30 : అనుముల మండలం వెంకటాపురం సమీపంలో గురువారం కారు అదుపుతప్పి బోల్తాపడడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లికి చెందిన మహంకాళి హరినాథ్, గట్టు మాధురి, విమలమ్మ, హరిప్రియ, వైష్ణవి అనుముల మండలం ఇబ్రహింపేట గ్రామానికి చెందిన వందనపు ఈశ్వరయ్య సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొనేందుకు కారులో బయల్దేరారు. వెంకటాపురం గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి బోల్తాపడింది. దాంతో కారులో ఉన్న ఐదుగురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నల్లగొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మాల్,మే30: చింతపల్లి మండల పరిధిలోని పోలేపల్లి గ్రామ శివారులోని సాగర్–హైదరాబాద్ రోడ్డు పక్కన గురువారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ బి.యాదయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నెలరోజుల నుంచి గుర్తు తెలియని వ్యక్తి భిక్షాటన చేస్తూ అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వయసు 45 నుంచి 50 సంవత్సరాలు ఉండవచ్చని, అతడి కుడి చేతికి ఆరు వేళ్లు ఉన